మహ్మద్‌ ఒమర్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలో కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ (సీఎస్‌ అండ్‌ ఐటీ) విభాగం పరిశోధక విద్యార్థి మహ్మద్‌ ఒమర్‌ ఆ విభాగం హెడ్‌ ప్రొఫెసర్‌ ప్రదీప్‌కుమార్‌ పర్యవేక్షణలో 'బిగ్‌ డేటా ఎనలిటిక్స్‌ అండ్‌ ప్రిడిక్షన్‌ త్రూ డీప్‌ లెర్నింగ్‌ ఫర్‌ ఎఫిషియెంట్‌ ట్రాన్స్‌పోర్టేషన్‌ సిస్టమ్‌' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఈ మేరకు ఆయనకు పీహెచ్‌డీని ప్రకటించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరైన రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ పేపర్లను ఎమ్మెల్యే గాంధీ సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. శ్రీరాంనగర్‌ కాలనీకి చెందిన మాలకొండయ్య అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా నిధులు విడుదలయ్యాయి.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



శిక్షణ పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్‌ శ్రీనివాస్‌

పటాన్‌చెరు టౌన్‌: నైపుణ్య శిక్షణతో ఉద్యోగాలు పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థులు ఎన్‌ఐఐటి ఎన్‌జీఓ మైక్రోసాఫ్ట్‌ కంపెనీ వారి సౌజన్యంతో ఆర్టిఫీషియల్‌ ఇంటలిజెన్స్‌, సైబర్‌ సెక్యూరిటీ , డేటా ఎనలిటిక్స్‌ అంశాలపై మూడు నెలలు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం డిగ్రీ కళాశాల ఆవరణలో సర్టిఫికెట్లను అందజేశారు.అనంతరం ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వడ్లూరి శ్రీనివాస్‌ మాట్లాడుతూ... శిక్షణలో 120 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 116 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అధ్యాపకురాలు ప్రవీణ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆన్‌లైన్‌,ఆఫ్‌లైన్‌ పద్ధతిలోనే కాకుండా లెర్నింగ్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టం ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ అధ్యాపకులు డాక్టర్‌ పూనంకుమారి, కరుణ కుమారి, వెంకటేశం, మల్లిక, సంతోష్‌ కుమార్‌ పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని సప్తగిరి కాలనీలోని శ్రీ కార్యసిద్ధి గణపతి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి , జంట నాగుల, నవగ్రహ సహిత శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిదేవాలయంలో సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణం జరిగింది. ఈ కళ్యాణంలో పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, అల్లం మహేష్‌, ప్రవీణ్‌ యాదవ్‌, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 11 మందికి ఒక్కొక్కరికి రూ. 1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

పోలీసులకు అభినందనలు

ఫిలింనగర్‌: బంగ్లాదేశ్‌ మహిళల అక్రమ రవాణాను అరికట్టి బాధితులను ప్రజ్వల షెల్టర్‌హోంకు తరలించిన ఘటనలో ప్రతిభ కనబర్చిన ఫిలింనగర్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, పంజగుట్ట ఉమెన్‌ కానిస్టేబుల్‌ నీనావత్‌ లావణ్యకు నగర పోలీసు కమిషనర్‌ సీవీ ఆనంద్‌ రివార్డులు అందజేసి ప్రశంసించారు. మహిళల అక్రమ రవాణాను అరికట్టడంలో వీరు చూపిన శ్రద్ధ, అంకితభావాన్ని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

యువతకు వెలుగునిస్తున్న లైట్‌ హౌస్‌

పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూత



టైలరింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు, విద్యార్థినులు

- కంప్యూటర్‌, సాఫ్ట్‌ స్కిల్స్‌ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు
- మహిళల స్వయంఉపాధికి ప్రత్యేక కోర్సులు
- జీహెచ్‌ఎంసీ, దాతల అండగా లైట్‌హౌస్‌ కమ్యూనిటీ నిర్వహణ

చందానగర్‌: పేద, మధ్య తరగతి యువతకు కనీస విద్యార్హతలు ఉన్నప్పటికి కంప్యూటర్‌ పరిజ్ఞానం, సాఫ్ట్‌స్కిల్స్‌ ఉండడం లేదు. దీంతో వారు అనుకున్న లక్ష్యాలను చేరలేకపోతున్నారు. శిక్షణ తీసుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇక నేడు కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రాని పరిస్థితి నెలకొంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర పూణెకు చెందిన గణేష్‌ నటరాజన్‌, రుచి మాథుర్‌లు కలిసి లైట్‌ హౌస్‌ కమ్యూనిటీస్‌ను ప్రారంభించారు. యువతకు అవసరమైన కంప్యూటర్‌ పరిజ్ఞానం, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి, ఇంగ్లిష్‌ మాట్లాడడం, మహిళలకు బ్యూటీషియన్‌, టైలరింగ్‌, ఎంబ్రాయిడరీతో పాటు 22 కోర్సులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. భారతదశంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు, దాతల సహాయంతో లైట్‌హౌస్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు పూణె, ఒడిశా, ముంబయి, ఢిల్లీ, లక్నో, హైదరాబాద్‌లలో 32 లైట్‌ హౌస్‌ కేంద్రాలు ఉన్నాయి. కోర్సులు ఉచితంగా నేర్పించి 80 శాతం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.



- రాష్ట్రంలో 2023 సంవత్సరంలో మొట్టమొదటి లైట్‌ హౌస్‌ను జీహెచ్‌ఎంసీతో కలిసి చందానగర్‌ హుడా కాలనీలో ఉన్న మోడల్‌ మార్కెట్‌ భవనంలో ఏర్పాటు చేశారు.
- యువతీ, యువకులకు సుమారు 22 రోజులు ఫౌండేషన్‌ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి యువత వారికి కావలసిన కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.
- యువకులకు ట్యాలీ, జావా, స్పోకెన్‌ ఇంగ్లిష్‌ నేర్పిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు కంప్యూటర్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌, బ్యూటీషియన్‌ కోర్సు, టైలరింగ్‌, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు.
- లైట్‌ హౌస్‌లో 12 మంది ట్రైనర్లు శిక్షణ ఇస్తారు.



హుడా కాలనీలోని లైట్‌ హౌస్‌ భవనం

ఫౌండేషన్‌ కోర్సు 22 రోజులు.. 3 నెలల పాటు మెళకువలు నేర్పిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

- నేటి వరకు 40 బ్యాచ్‌లతో 920 మంది యువత శిక్షణ కోసం నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 418 మంది ఉద్యోగాలు పొందారు. 291 మంది వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- ఐటీ ఉద్యోగులు వచ్చి యువతకు కావలసిన కోర్సులలో పాఠాలు చెబుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవల మల్లేపల్లిలో ప్రారంభించారు. నగరంలో మరో మూడు లైట్‌హౌస్‌లు కూకట్‌పల్లి, బోరబండ, ఎల్బీనగర్‌లలో ఏర్పాటు చేయనున్నారు.
- లైట్‌ హౌస్‌లో కోర్సులలో చేరాలంటే 18–35 సంవత్సరాల వరకు పరిమితి ఉంది. ఆధార్‌ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్‌ ఉండాలి.

ఉచిత శిక్షణ



చందానగర్‌లోని లైట్‌ హౌస్‌లో పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్‌.. వివిధ రకాల కోర్సులు ఉచితంగా నేర్పిస్తున్నాం. ఉద్యోగ అవకాశాల కోసం వెతుకుతున్న పేద యువత కోసం పని చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీల సహాయంతో మరిన్ని లైట్‌ హౌస్‌ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నాం. 40 బ్యాచ్‌లతో 920 మంది యువత నమోదు చేసుకున్నారు.

– శ్రీనివాస్‌ ఆకుల, మేనేజర్‌, లైట్‌హౌస్‌



వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందిన యువత

దశలవారీగా చెరువుల సుందరీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌: నియోజకవర్గంలోని చెరువులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్‌ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై టౌన్‌ ప్లానింగ్‌ విభాగం అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎస్‌ఆర్‌ నిధులతో చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. రోడ్ల విస్తరణ, లింకు రోడ్ల పనులకు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తియ్యేలా చూడాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, టౌన్‌ ప్లానింగ్‌ అధికారి ఏసీపీ నాగిరెడ్డి, రాకేష్‌, సర్వేయర్‌ జగదీశ్వర్‌, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. 11 ఫిర్యాదులు

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 వినతి పత్రాలు అందగా టౌన్‌ప్లానింగ్‌ 1, రెవెన్యూ 1, ఇంజనీరింగ్‌ విభాగాలకు 3 వచ్చాయని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అందజేశారు.టౌన్‌ప్లానింగ్‌ 3, ఇతర విభాగాలకు రెండు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వివరించారు. ఈఈ దుర్గా ప్రసాద్‌, ఏఎంసీలు శ్రవణ్‌కుమార్‌ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరి పాల్గొన్నారు.



ప్రజావాణిలో డీసీ మోహన్‌రెడ్డికి ఫిర్యాదులు అందజేస్తున్న ప్రజలు



శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..

డంపింగ్‌ యార్డులో రీ సైక్లింగ్‌ వస్తువులను తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలి

శేరిలింగంపల్లి జోనల్‌ కార్యాలయానికి తరలి వచ్చిన స్వచ్ఛ ఆటో కార్మికులు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు రాజేందర్‌, గోపాల్‌నాయక్‌ తదితరులు

శేరిలింగంపల్లి: దీప్తిశ్రీనగర్‌ డంపింగ్‌ యార్డులో రీ సైక్లింగ్‌ వస్తువులను తీసుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలని స్వచ్ఛ ఆటో కార్మికులు జోనల్‌ కమిషనర్‌ను కోరారు. సోమవారం స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్‌, రిక్షా కార్మికుల యూనియన్‌ ఆధ్వర్యంలో కార్మికులు శేరిలింగంపల్లి జోనల్‌ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. చందానగర్‌ సర్కిల్‌కు చెందిన ఆటో డ్రైవర్లు రోజు కాలనీల నుంచి సేకరించిన చెత్తను దీప్తిశ్రీ నగర్‌లోని చెత్త డంపింగ్‌ యార్డుకు తరలిస్తారు. చెత్త నుంచి ప్లాస్టిక్‌, ఇతర మెటీరియల్‌ను తీసుకుంటామని ఆయనకు వివరించారు. ఆటో టిప్పర్‌, రిక్షా కార్మికుల యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్‌, జీహెచ్‌ఎంసీ అధ్యక్షులు గోపాల్‌నాయక్‌లు మాట్లాడుతూ డంపింగ్‌ యార్డు ప్రతినిధులతో మాట్లాడతానని జోనల్‌ కమిషనర్‌ చెప్పారని వెల్లడించారు.

వర్గీకరణ చేసేదాకా అన్ని ఫలితాలను ఆపాలి: ఎమ్మార్పీఎస్‌



నార్సింగిలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్‌ నేతలు

మణికొండ: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్‌–1, 2, 3లతో పాటు అన్ని రకాల ఫలితాలను నిలిపి వేయాలని ఎమ్మార్పీఎస్‌ గండిపేట మండల ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ, ఎంఎస్‌ఎఫ్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాని, భానుప్రసాద్‌మాదిగ డిమాండ్‌ చేశారు. ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు నార్సింగి చౌరస్తాలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో ఉండే మాలల ఒత్తిడికి, పలుకుబడికి తలొగ్గి మాదిగలకు అలాగే ఎస్సీ వర్గీకరణ కోరుకునే దళితులకు రేవంత్‌రెడ్డి సర్కారు తీరని ద్రోహం చేస్తున్నదని స్పష్టం అవుతుందన్నారు. కార్యక్రమంలో మంచిరేవుల గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్‌మాదిగ, ఖానాపూర్‌ గ్రామ అధ్యక్షుడు పెద్దపులి శంకర్‌మాదిగ, నేతలు లింగంపల్లి దేవదాస్‌మాదిగ, రంజిత్‌మాదిగ, నరేష్‌మాదిగ, నరేందర్‌మాదిగ, బాలరామ్‌, గుండు మల్లప్ప, సాయిమాదిగ, మీట్టుమాదిగ, వెంకటేష్‌, కృష్ణమాదిగ పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి, సిబ్బంది

చందానగర్‌: గ్రేటర్‌ హైదరాబాద్‌ భారతీయ మజ్దూర్‌ సంఘ్‌ (బీఎంఎస్‌) యూనియన్‌ అధ్యక్షులు శంకర్‌ ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. సోమవారం చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎంఎస్‌ యూనియన్‌ అధ్యక్షులు శంకర్‌ ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండేవాడన్నారు. ఏఎంసీలు మహేందర్‌రెడ్డి, కృష్ణ, విజయ్‌, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి, శానిటరీ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, సిబ్బంది ఉన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మియాపూర్‌: మియాపూర్‌లోని ముజఫర్‌ అహ్మద్‌నగర్‌లో ఏఐఎఫ్‌డీవై, ఏఐఎఫ్‌డిడబ్ల్యూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి అంగడి పుష్ప, నాయకులు ఇస్లావత్‌ దశరథ్‌ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శివానీ, అనిత, సుల్తానాబేగం, శంకర్‌, ఈశ్వరమ్మ, లక్ష్మీ, ఇందిర, నిర్మల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం: బీఆర్‌ఎస్‌

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో సంబంధిత అధికారులు విఫలం అవుతున్నారని బీఆర్‌ఎస్‌ మణికొండ మున్సిపల్‌ విభాగం అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆరోపించారు. గుడ్‌మార్నింగ్‌ మణికొండ .. మార్నింగ్‌ వాక్‌లో భాగంగా సోమవారం బీఆర్‌ఎస్‌ నాయకులు కుంభగళ్ల ధనరాజ్‌, బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంఘం శ్రీకాంత్‌, సుమనళిని, భానుచందర్‌, బొడ్డు శ్రీధర్‌లతో కలిసి పుప్పాలగూడ ప్రాంతంలోని వినాయక్‌నగర్‌ ఫేస్‌–2 పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధూళిపాళ మాట్లాడుతూ... మణికొండ పరిధిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. చెత్తా చెదారంతో నిండి ఉన్న రహదారులు, దోమల బెడదతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున మురుగు రహదారులపై పొంగిపొర్లుతుండడంతో ఆయా ప్రాంతాలు దుర్గంధ పూరితంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్‌ కోతల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలపై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

అనాథ పిల్లలకు అండగా నిలవాలి



అనాథాశ్రమం ప్రారంభోత్సవంలో నిర్మాత సి.కళ్యాణ్‌

ఫిలింనగర్‌: అనాథ ఆశ్రమాలకు అండగా నిలవడంతో పాటు అనాథ బాల, బాలికలకు వారి ఎదుగుదలలో వారి చదువుల కోసం వారి ఉపాధి అవకాశాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రముఖ సినీ నిర్మాత సి.కళ్యాణ్‌ కోరారు. ఫిలింనగర్‌లో లవింగ్‌ హ్యాండ్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ అనాథాశ్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను ఆదరించాలని, వారిని ప్రోత్సహించి చదివిస్తే సమాజానికి మంచి జరుగుతుందని అన్నారు. అనాథ ఆశ్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ చైర్మన్‌ డాక్టర్‌ బి.పీటర్‌ పాల్గొన్నారు.

తల్లీ,కూతురు అదృశ్యం



మియాపూర్‌: ఇంట్లో గొడవపడిన నేపథ్యంలో తల్లీ కూతురు అదృశ్యమయ్యారు. మియాపూర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్‌ లక్ష్మీనగర్‌ కాలనీకి చెందిన హరిజన గీత(28) తన కూతురు హరిజన ఉమా మహేశ్వరి(6) పది సంవత్సరాలుగా సోదరుడైన గిరిప్రసాద్‌ వద్దే ఉంటోంది. ఈ నెల 5వ తేదీ గీతను తల్లి మందలించడంతో సాయంత్రం 6 గంటల సమయంలో కూతురు ఉమామహేశ్వరిని తీసుకుని గీత ఇంటినుండి వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. గీత ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ అయింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రమాదపుటంచుల్లో పాదచారి!



ట్రాఫిక్‌లో రోడ్డు దాటుతున్న విద్యార్థులు

- ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ప్రతిపాదనల దశ దాటని వైనం
- ప్రమాదాల బారిన పాదచారులు
- రోడ్డు దాటాలంటే భయపడుతున్న ప్రజానీకం
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పలు ప్రాంతాల్లో రహదారులు దాటే యత్నంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలు రోజురోజుకూ అధికం అవుతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం. రోడ్లు దాటేందుకు ప్రతిపాదించిన ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

- గండిపేట్‌ మండలం బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి ప్రధాన జాతీయ రహదారి హైదరాబాద్‌–బీజాపూర్‌ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్‌ సమస్యలు సైతం అధికంగా ఉంటాయి. రోడ్డు దాటే సమయంలో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని అరికట్టేందుకు ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బిక్కుబిక్కు మంటూ.. రోడ్డు దాటుతూ...

రోజూ ఉదయం వేళల్లో స్కూళ్లు, కాలేజీలు, ఉద్యోగాలకు వెళ్లే జనాలు రోడ్లపై ఏర్పడిన ట్రాఫిక్‌ సమస్యతో రోడ్డు దాటే సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. బిక్కుబిక్కు మంటూ రోడ్డు దాటుతున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్‌ సమస్యను దృష్టిలో ఉంచుకొని ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదు.

కాళీమందిర్‌ ప్రాంతంలో...

కాళీమందిర్‌కు అమ్మవారి దర్శనం నిమిత్తం నిత్యం భక్తులు వస్తుంటారు. వారు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. దేవాలయ ప్రాంతంలో పాదచారుల సౌకర్యార్థం రోడ్డు దాటేందుకు ట్రాఫిక్‌ అధికారులు గతంలో ప్రత్యేక సిగ్నల్‌ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం పని చేయకపోవడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జనాభా అవసరాలకు అనుగుణంగా...

బండ్లగూడ జాగీర్‌ సిటీలో అంతర్‌ భాగంగా ఉండి కార్పొరేషన్‌గా మారింది. ఈ ప్రాంతంలో గృహ సముదాయాలు, పెద్ద పెద్ద విల్లాలు, గేటెడ్‌ కమ్యూనిటీలు భారీగా వెలిశాయి. మరిన్ని వచ్చే అవకాశం ఉంది. శరవేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ, ట్రాఫిక్‌ సౌకర్యాలను మెరుగుపర్చడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రతిపాదించిన ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలను నిర్మించాల్సిన అవసరం ఉంది.

ఆర్‌అండ్‌బీకి ప్రతిపాదనలు

ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాము. టిప్పుఖాన్‌పూల్‌ బ్రిడ్జి నుంచి తెలంగాణ పోలీస్‌ అకాడమీ వరకు మీడియన్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తు చేస్తాం. యూటర్న్‌ ఉన్న దగ్గర పెలికాన్‌ సిగ్నల్స్‌ పెట్టి పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌ ఏర్పాటు చేస్తాం. ఆ ప్రాంతంలో రోడ్డు దాటేలా రోడ్ల భవనాల శాఖకు ప్రతిపాదనలు సమర్పించాం.

– నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌, నార్సింగి

బ్రిడ్జిలను నిర్మిస్తాం

గతంలో కౌన్సిల్‌ సమావేశంలో కూడా ప్రతిపాదనలు పెట్టాం. అవి అమలు కాలేదు. కానీ పాదచారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడే ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రతిపాదించాం. ఆదిశగా చర్యలు చేపట్టి ప్రణాళికలు సిద్ధం చేస్తాం. త్వరలో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలను నిర్మిస్తాం.

– శరత్‌చంద్ర, కమిషనర్‌, బండ్లగూడ జాగీర్‌